www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 19 | డిసెంబర్ | 2024
పేజీలు 6


## భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి



-ప్రాజెక్టుల భూసేకరణపై కలెక్టర్ సమీక్ష

2 లో

# జాబితా సరే.. జమలేవీ..?




**-నాల్గవ విడత రుణమాఫీలో గందరగోళం**
**-బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** రుణమాఫీపై రైతుల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న వేళ నాల్గవ జాబితా మరింత గందరగోళానికి దారితీసింది. గత నెల 30న మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు సదస్సులో రెండు లక్షలలోపు వ్యవసాయ రుణం ఉండి వివిధ కారణాలతో రైతుల ఖాతాల్లో జమ కాని వాటికి సంబంధించి ముఖ్యమంత్రి మూడు వేల కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. డిసెంబర్ నెలలో ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు ఇచ్చిన తర్వాత ఏడవ తారీఖు నాటికి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించారు. కాని ఇంత వరకు ఏ రైతు ఖాతాలోనూ నగదు జమ కాలేదు. సహకార సంఘాలకు, బ్యాంకులకు జాబితాలైతే వచ్చాయి కాని నగదు జమ కాలేదు. దీనితో రైతులు బ్యాంకులు, సహకార సంఘాల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంక్ అధికారులకు కూడా దీనికి సంబంధించి సరైన అవగాహన లేకపోవడంతో పూటకొక రీతిన సమాధానం చెబుతూ రైతులను గందరగోళ పరుస్తున్నారు. ఇన్సూరెన్స్‌లు అంటూ ఒకట్రెండు రోజులు సమాధానం చెప్పిన బ్యాంక్ అధికారులు కొందరు ఇప్పుడు ఐదవ జాబితా అంటూ రైతులను నిరాశపరిచేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామానికి చెందిన జల్లా సుధాకర్ అనే రైతు డిసిసిబి పరిధిలోని టేకులపల్లి రైతు సేవా సహకార సంఘం ద్వారా వ్యవసాయ రుణం తీసుకున్నారు. రూ. 50వేల రుణం తీసుకున్న సుధాకర్‌కు మొదటి మూడు దఫాల్లోను మాఫీ కాలేదు. పలుమార్లు బ్యాంకుల చుట్టూ తిరగగా కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగలేదని చెప్పి ఇంటికి వచ్చి మూడు నెలల క్రిందట ఫోటోలు

మిగతా 2లో..

## సిపిఐ చరిత్రను యువతకు చాటండి




**సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**

**ప్రజాపక్షం/బోనకల్:** భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో, తాడిత, పీడిత, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, హక్కుల కోసం అనునిత్యం పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) వందేళ్ల చరిత్రను నేటి యువతరానికి తెలియజేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బోనకల్, మధిర మండలాల, మధిర పట్టణ కార్యవర్గ సభ్యుల సంయుక్త సమావేశం ఆకెన పవన్, సిలివేరు శ్రీనివాస్‌రావుల అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బాగం హేమంతరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో భారత కమ్యూనిస్టు పార్టీ కీలక భూమిక పోషించదన్నారు. మీరట్, కన్పూర్ కుట్ర కేసులలో పదుల సంవత్సరాల పాటు కమ్యూనిస్టులు జైలు జీవితం గడిపినట్లు ఆయన గుర్తు చేశారు. అక్టోబర్ విప్లవం విజయవంతమై నందున భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన

మిగతా 2లో..

## ప్రజాస్వామ్యాన్ని బిజెపి ధ్వంసం చేస్తుంది..




**-కార్మిక చట్టాలను తీసుకువచ్చి కార్పోరేట్ శక్తులకు దాసోహం అంటుంది.**
**-సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘువులు**
**-మూసి ప్రక్షాళనలో ఫార్మా కంపెనీలపై చర్యలు తీసుకునే దమ్ము ముఖ్యమంత్రికి ఉందా..?**
**-రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

**ప్రజాపక్షం /సత్తుపల్లి :** ప్రజా స్వామ్యాన్ని బిజేపి ప్రభుత్వం ధ్వంసం చేస్తుందని మండిపడ్డారు సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘువులు. బుధవారం పట్టణంలోని లక్ష్మి ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో గల మోరంపూడి పుల్లయ్య ప్రాగణంలో భారత కమ్యూనిస్టు పార్టీ( మార్క్సిస్టు) 22వ ఖమ్మం జిల్లా మహాసహాభలను ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిధులుగా సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు,రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వెంకట్, కేంద్ర కమిటీ సభ్యులు సాయిబాబా తదితరులు హాజరయ్యారు. ముందుగా స్థానిక రావి వీరవెంకయ్య భవనం నుండి మహాసభ వేదిక వరకు వందలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీగా ఎర్రజండాలు చేతబూని పయనమయ్యారు.

మిగతా 2లో..

# జాబితా సరే.. జమలేవీ..?

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుని వెళ్లారు. నాల్గవ జాబితాలో వస్తుందన్న ఆశతో బ్యాంకు వద్దకు వెళితే తొలిరోజు జాబితాలో పేరు ఉంది కాని ఇంకా నగదు జమ కాలేదన్న బ్యాంకు అధికారులు మరి కొద్ది రోజులు వేచి చూడాలని కోరారు. వ్యవసాయ అధికారుల వద్దకు వెళితే మీకు ఇన్సూరెన్స్‌కు సంబంధించి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని అందుకే రుణమాఫీ జరగ లేదని సంబంధం లేని సమాధానం చెబుతున్నారన్నారు. ఇదిలా ఉండగా బ్యాంక్‌కు సంబంధించి సొసైటీ పరిధిలోని రుణం పొందిన రైతులకు సంబంధించి బ్యాంకు అధికారుల తప్పిదం కూడా రైతుల పాలిట శాపంగా మారినట్లు తెలుస్తుంది. రైతులకు సంబంధించిన ఇన్సూరెన్స్ డబ్బులను కూడా రుణ మొత్తంలో కలిపి చూపడంతో బ్యాంక్ ఉన్నతాధికారులు తిరస్కరించారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మొత్తంగా నాల్గవ విడత నగదు జమ కాకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. నాలుగు విడతల జాబితాలోనూ చోటు దక్కని రైతులు ఉన్నారంటే ఆశ్చర్యం కలుగక మానదు. రెండు లక్షలలోపు ఉన్న రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగక పోగా అమాత్యుల పొంతన లేని ప్రకటనలు ఇప్పుడు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను తీసుకు వస్తున్నాయి. రెండు లక్షల పైబడిన రైతులకు రుణమాఫీ చేస్తామని రెండు లక్షలు పైన రుణాన్ని రైతులు




చెల్లిస్తే రెండు లక్షల రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. అనేక వేదికల మీద ఈ విషయాన్ని మంత్రులు స్పష్టం చేశారు. మొత్తం రుణమాఫీ రూ. 31వేల కోట్లు జమ చేయాల్సి ఉండగా రూ.20వేల కోట్లు జమ చేసి రుణమాఫీ సంపూర్ణమైందని ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ప్రభుత్వం గతంలో ప్రకటించినవిధంగా రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నాల్గవ విడత గందరగోళానికి ప్రభుత్వం తెరదించాలని కోరుతున్నారు.

# ప్రజాస్వామ్యాన్ని బిజెపి ధ్వంసం చేస్తుంది..




(మొదటిపేజీ తరువాయి)

అనంతరం ఇటీవల పార్టీలో మృతి చెందిన కార్యకర్తలకు సంతాప తీర్మానం ప్రకటించి రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా బీవీ రాఘవులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలో మహసభలు జరుగుతున్నాయని,ఈ సభలలో ప్రజా సమస్యలు, దేశంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న ఆకృత్యాలపై చర్చిస్తామన్నారు. అదేవిధంగా పార్టీ భవిష్యత్ కార్యచరణ ప్రణాళికను తయారు చేస్తామన్నారు. బిజెపి పార్టీ 75 ఎండ్ల దేశ రాజ్యాంగానికి నష్టం కలిగించే విధంగా పలు ఆంశాలు ప్రవేశపెట్టాలని చూస్తుందని, అందులోనివే నాలుగు కార్మిక చట్టాలన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టాన్ని ఈ ప్రభుత్వం తీసుకురాకుండా కార్పోరేట్ శక్తులైన అదాని, అంబానీలకు దాసోహం అంటుందన్నారు.ఈ మద్య కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసిందని, రైతు చట్టాలపై తమ అభిప్రాయాలను తెలపాలని కోరిందన్నారు. జీఎస్‌టి ద్వారా పేదల నడ్డి ఏ విధంగా విరుస్తుందో గమనిస్తూనే ఉన్నామన్నారు. అదేవిధంగా కార్మిక చట్టాలు పనిచేసి రైతాంగం నడ్డి విరుస్తాయన్నారు. మనం పండించే పంటను మనం అమ్ముకునే హక్కు లేకుండా చేయాలనేది బిజెపి ప్రభుత్వం సిద్ధాంతమన్నారు. అదేవిధంగా కోట్ల రూ.ఈజిఎస్ నిధులను వేరే పథకాలకు దారి మళ్ళిస్తుందని మండిపడ్డారు. కార్పోరేట్ కంపెనీలను అదానికి, వ్యవసాయాన్ని అంబానికి అందించి దేశాన్ని నాశనం చేయాలనేది భారత ప్రదాని మోడి కుట్ర అన్నారు. జమిలి ఎన్నికలతో దేశంలో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే కుట్ర చేస్తుందన్నారు. డిల్లీ ఎన్నికలలో గెలవటం కోసం జమిలి ఎన్నికల డ్రామాను బిజెపి ముందుకు తీసుకొచ్చిందన్నారు. దళితులు, మైనార్టీల మీద కక్ష తీర్చుకునే ప్రయ త్నం చేస్తుందని దీనిపై అందరి సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

**ఫార్మా కంపెనీలపై చర్యలు తీసుకునే దమ్ము ముఖ్యమంత్రికి ఉందా...**



రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మూసి నది ప్రక్షాళన అంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీలో విషాలను వదులుతున్న ఫార్మా కంపెనీలపై చర్యలు తీసుకునే దమ్ముందా అని ప్రశ్నించారు రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం. ఫార్మా కంపెనీల పేరుతో రెండు పంటలు పండుతున్న భూములను లాక్కుని ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూస్తే ఎర్రజండా చూస్తు ఊరుకునేదిలేదన్నారు. రామగుండం ప్రాజెక్ట్ పేరుతో సుమారు 3వేల ఎకరాలలో లక్షలలో చెట్లను నరికారని ఆవేధన వ్యక్తం చేశారు. బిజేపిని ఎదుర్కోనేందుకు గల ఎన్నికలలో కాంగ్రెస్‌తో కలిసి కూటమిగా ఏర్పడామని, కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో కాదన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాలతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఒక్క ఫ్రీ బస్సు తప్ప ఏ ఒక్క గ్యారంటీని సరిగ్గా అమలు చేయటం లేదన్నారు. హైడ్రా పేరుతో అక్రమ కట్టాడాలను కూల్చకుండా సామాన్యులు, పేదల ఇండ్లను కూల్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షాసానందం పొందారన్నారు. అటువంటి చర్యలు మరలా పునరావృతం అయితే సిపిఎం పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు.రాష్ట్రంలో కేసిఆర్ మార్క్ లేకుండా కనుమరుగు చేయాలనే లక్ష్యంతో తెలంగాణ తల్లిని మార్చారని , ఇలా మార్చుకుంటూ పోతే ప్రజల్లో మార్పు వచ్చి కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మార్చే సమయం కూడా వస్తుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి పోరాడామని, రానున్న రోజులు ఎర్ర జండాదేనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సుదర్శన్, పాలడుగు బాస్కర్, వెంకటేశ్వరరావు మక్కా, బుర్రి వెంకన్న, తాళ్ళ నాగరాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ కనకయ్య, ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు సోమయ్య, నాయకులు తాతా బాస్కర్, మోరంపూడి పాండు రంగారావు, మాచర్ల భారతి, జాజిరి శ్రీను,కొలికపోగు సర్వేశ్వరరావు,రావుల రాజబాబు, నాయుడు వెంకటేశ్వరరావు, జాజిరి జ్యోతి, మల్లూరి చంద్రశేఖర్ సత్తుపల్లి, వైరా, మధిర, పాలేరు డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌టిఆర్, బాలయ్య అభిమానులు నిరసన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** ఎన్‌టిఆర్ ఘాట్‌ను తొలగించి అసెంబ్లీ సముదాయాలు కట్టాలని ఎంఎల్‌ఎ రాజ్‌గోపాల్‌రెడ్డి వ్యాఖ్యాలకు నిరసనగా ఎన్‌టిఆర్, బాలయ్యబాబు అభిమానులు ఖమ్మంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఖమ్మంజిల్లా ఎన్‌టిఆర్ అభిమానులు, టిడిపి నాయకులు కేతినేని హరీష్‌చంద్ర ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఎంఎల్‌ఏ రాజగోపాల్ వ్యాఖ్యాలను ఖండిస్తూ నిరసన తెలిపారు. నందమూరి బాలయ్య బాబు అభిమాన సంఘం నాయకులు నల్లమల రంజిత్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి నిరసన తెలిపారు. తెలుగు ప్రజల గుండెల్లో నందమూరి తారక రామారావు చిర స్థాయిగా నిలిచి పోతారని అటువంటి మహానీయుని ఘాట్‌ను తొలగించాలని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ అభిమానులు మందడపు సుధాకర్, మీగడ రామారావు, మోతారపు సుధాకర్, చింతనిప్పు నాగేశ్వరరావు, నాగండ్ల లక్ష్మణ్, కన్నెటి పృథ్వీ, కూచిపూడి జై, బోడేపూడి రవి, చల్లగుండ్ల రమేష్, తాళ్లూరి నారాయణరావు, నర్రపునేని శంకర్, బాలకృష్ణ అభిమానులు సతీష్, మధు, తారక్, శేఖర్, రాజేశ్వరి, ప్రభు, రామకృష్ణ, నరేష్, ఉదయ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో వివిధ ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సమీక్షించారు. నేషనల్ హైవే 365 బిజి ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్‌కు ప్యాకేజి 1,2, 3 లకు సంబంధించి 1358.1650 ఎకరాల భూసేకరణకు గాను 1292.1825 ఎకరాలకు అవార్డు పూర్తి చేసినట్లు నేషనల్ హైవే ద్వారా రూ.362.17 కోట్ల పరిహారాన్ని డిపాజిట్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రూ. 355.85 కోట్ల నష్టపరిహారం రైతుల ఖాతాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్‌కు కావాల్సిన భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుల వారీగా చేయాల్సిన భూసేకరణ, పూర్తి చేసినది, ఇంకా చేయాల్సింది, కోర్టు కేసులో ఉన్నది తదితర అంశాలపై కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకం ఏన్కూరు లింక్ కాలువ మిగులు భూసేకరణ పూర్తిపై దృష్టిసారించాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న పనుల భూసేకరణకు రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. భూసేకరణ చేసిన ప్రాజెక్టులకు సంబంధించి పనులు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, నేషనల్ హైవే పిడి రామాంజనేయ రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఈ హేమలత, ఆర్డివోలు జి. నర్సింహారావు, రాజేందర్, ఇరిగేషన్, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

# సిపిఐ చరిత్రను యువతకు చాటండి



(మొదటిపేజీ తరువాయి)

తొలి రోజులల్లోనే బ్రిటీష్ ప్రభుత్వం సిపిఐని రద్దు చేసిందని అన్నారు. సంపూర్ణ స్వాతంత్రం కోసం పోరాడిన పార్టీ ఒక్క సిపిఐ అని అన్నారు. దేశ సమగ్ర కోసం, ఐక్యత కోసం పంజాబ్ జరిగిన వేర్పాటు వాదానికి వ్యతిరేకంగా సిపిఐ పోరాడిందని అన్నారు. తెలంగాణలో సాయుధ పోరాటంతో ఈ ప్రాంతాన్ని విముక్తి చేసిన ఘనత ఒక్క సిపిఐదేనని అన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్మృతులు, వీరగాధలు ఉన్నట్లు ఇప్పుడున్న యువతకు తెలియదని అన్నారు. ప్రతి గ్రామంలో అప్పటి నాయకులు పంచిన భూముల విషయాలు, చేసిన త్యాగాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రస్తుత యువతకు తెలియజెప్పాల్సిన బాధ్యత మనమీదే ఉందని అన్నారు.

**-వంద సంవత్సరాల ప్రారంభ వేడుకలను జయప్రదం చేయండి : దండి**

వంద సంవత్సరాల ప్రారంభ వేడుకలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. వందేళ్లలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి కార్యకర్త పార్టీ చరిత్రను యువతరానికి తెలిసేలా ప్రచారం చేయాలని అన్నారు. ఈ నెల 26న సర్దార్ పటేల్ స్టేడియం నుండి భక్తకళారామదాసు కళాక్షేత్రం వరకు వందమంది రెడ్‌షర్ట్ వాలంటీర్లు, వంద జెండాలతో ర్యాలీ ఉంటుందని అన్నారు. అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే వంద సంవత్సరాల ప్రారంభ సభను ప్రతి సభ్యుడు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో సుదీర్ఘ కాలం పాటు అభివృద్ధి కోసం కృషి చేసిన పారుపల్లి రాఘవులు(బ్రాహ్మణపల్లి), యంగల యేలేషు (కలకోట), వల్లెబోయిన జానయ్య, తూము సుశీలమ్మ(రాయన్నపేట), కంటెపూడి దేవదానం(రాయపట్నం) తదితరులను ఈ సందర్భంగా సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు, ఏనుగు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శులు యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, ఎంఎ రహీం, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, చెరుకూరి వెంకటేశ్వరరావు, అన్నవరపు సత్యనారాయణ, జల్లా బ్రహ్మ, ఎస్‌కె కొండా, మధిర మండల నాయకులు నాగకృష్ణచారి, యంగళ పెద్ద రమేష్, బుర్రి నాగేశ్వరావు, బెజవాడ నరేష్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, యంగల వెంకటమ్మ, ఏనుగు రవి, వంగాల నరసింహ, వంగాల కృష్ణ పాల్గొన్నారు.

# సిఎం కప్‌లో మెరిసిన త్రివేణి విద్యార్థులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** సిఎం కప్ క్రీడా పోటీల్లో త్రివేణి విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు గెలుచుకున్నారు. ఖమ్మం నగరంలో సర్దార్ పటేల్ మైదానంలో మూడురోజుల పాటు నిర్వహించిన సిఎం కప్ క్రీడా పోటీల్లో త్రివేణి పాఠశాలకు చెందిన అబ్బూరి వినయ్ జిల్లా స్థాయిలో మొదటి బహుమతి, బచ్చు విశ్వ తేజన్ ద్వితీయ బహుమతి గెలుచుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, త్రివేణి, కృష్ణవేణి విద్యా సంస్థల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సిఆర్‌వో మురళికృష్ణ, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జి చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

# మెరుగైన సేవలందించేలా విధులు నిర్వహించాలి

**-పలు కార్యాలయాలు, సెక్షన్లను తనిఖీ చేసిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** ప్రజలకు మెరుగైన సేవలు అందేవిధంగా ప్రభుత్వ సిబ్బంది విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలను, సెక్షన్లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టరేట్‌లోని భోజన శాల, ముఖ్య ప్రణాళికాధికారి, రెవెన్యూ విభాగాలు, హౌజింగ్ సెక్షన్, లేడీస్ లాంజ్, స్ట్రాంగ్ రూములను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలను ఓపికగా వింటూ త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన భోజనశాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. విధులకు సిబ్బంది సకాలంలో హాజరు కావాలని, సమయ పాలన పాటించాలన్నారు. నిరుపేదలైన లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు. మనం అధికారులుగా ఉన్న సమయంలో పేదలకు సాయం చేయాలనే దృక్పథంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్దిదారులందరికీ పూర్తి స్థాయిలో లబ్ది చేకూరేలా చూడాలన్నారు.

# గడువులోగా సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలి

**-సిఎంఆర్ రైస్ డెలివరీపై అదనపు కలెక్టర్ సమీక్ష**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నిర్దేశిత గడువు లోగా సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి జిల్లాలోని మిల్లర్లు, రెవెన్యూ, సంబంధిత అధికారులతో సిఎంఆర్ రైస్ (వానా కాలం యాసంగి 2023 24) డెలివరీపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో వానా కాలం పంట క్రింద 80,903 వేల మెట్రిక్ టన్నుల సిఎంఆర్ రైస్ డెలివరీకి గాను 69,592 వేల మెట్రిక్ టన్నుల రైస్, యాసంగి పంటకు సంబంధించి 14,757 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం డెలివరీకి గాను 7,743 వేల మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. వానాకాలం, యాసంగి కలిపి జిల్లాలోని రైస్ మిల్లర్లు మరో 18,324 వేల మెట్రిక్ టన్నుల సిఎంఆర్ రైస్ డెలివరీ చేయాల్సి ఉందని వీటిని ప్రభుత్వం నిర్దేశిత గడువు లోగా అందించాలన్నారు. నాణ్యత లేని ధాన్యం ఉంటే రైస్ మిల్లర్లు తీసుకోవద్దని అంతే తప్ప ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఖమ్మంజిల్లాలో నాణ్యమైన ధాన్యం పండుతుందని ఆయన తెలిపారు. ధాన్యం తూర్పార పట్టాల్సిన అవసరం ఉంటే తప్పనిసరిగా చేస్తామని, తూర్పార పట్టకుండా రైస్ మిల్లులకు ధాన్యం తరలిస్తున్న కొనుగోలు కేంద్రాల వివరాలు అందించాలని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి ఏ వాహనాలు ఏ సెంటర్‌కు, రైస్ మిల్లులకు అలాట్ చేస్తున్నామో పక్కా సమాచారం ఉండాలని, రైస్ మిల్లర్ కొనుగోలు కేంద్రాల ఇంచార్జి, రవాణా కాంట్రాక్టర్ సమన్వయంతో పనిచేస్తూ రవాణా ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, మిల్లర్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొణిజర్ల పంచాయతీలో పేరుకుపోతున్న చెత్త

**-మూడు రోజులుగా గ్రామంలో తిరగని చెత్త ట్రాక్టర్**
**-పట్టించుకోని పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల కేంద్రం కొణిజర్ల మేజర్ గ్రామపంచాయతీ గ్రామంలో పలు కారలనీలతోపాటు వ్యాపారసముదాయలు కూడా కలవు. కిరాణాషాపులు, ఫెర్టిలైజర్స్ , హోల్‌సేల్ కూరగాయల దుకాణాలు ఉన్నాయి. ఇండ్లలోని చెత్తతోపాటు వ్యాపారసముదాయల వద్దకూడా చెత్త ఉంటుంది. మేజర్ గ్రామపంచాయతీకి జూనియర్ పంచాయతీ కార్యదర్శిని నియమించడంతోనే కొంత సమస్య ఏర్పడింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శికూడా వ్యక్తిగత అవసరాలనిమిత్తం సెలవుపెట్టడంతో ఓ గ్రామపంచాయతీ కార్యదర్శికి ఇన్‌చార్జ్ అప్పజెప్పారు. ఇన్‌చార్జ్ కార్యదర్శికూడా గ్రామప్రజలకు అందుబాటులో లేకుండా ఉండటంతో గత మూడురోజులుగా సోమ, మంగళ, బుధ వారం రోజుల్లో గ్రామంలో చెత్త ట్రాక్టర్ తిరగడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇన్‌చార్జ్ కార్యదర్శికూడా అందుబాటులో లేకపోవడంతో చెత్త పేరుకుపోతుందని ప్రజలంటున్నారు. సిబ్బంది ఉన్నా చెత్త ట్రాక్టర్ ఎందుకుతిరగడంలేదో అర్థంకాని పరిస్థితి. మేజర్ పంచాయతీకి సీనియర్ పంచాయతీ కార్యదర్శిని నియమిస్తేనే పంచాయతీకి న్యాయం జరుగుతుందని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ అధికారి, జిల్లాకలెక్టర్ కొణిజర్ల పంచాయతీపై దృష్టిసారించి సీనియర్ పంచాయతీ కార్యదర్శిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# సిపిఐ శత వసంతాల ప్రారంభ సభను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/తల్లాడ :** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆవిర్భావించి డిసెంబర్ 26తేదీకి నూరు వసంతాల్లోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించనున్న సిపిఐ శత వసంతాల ప్రారంభ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా నాయకులు మద్దోజు శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం తల్లాడ మండల కేంద్రంలో మండల పార్టీ సమావేశాన్ని మండల కార్యదర్శి ఒర్సు రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్లగా ఎన్నో సమస్యలపై సిపిఐ సమరశీల పోరాటాలు చేసి ప్రతి పేదోడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆనాటి అమరవీరుల త్యాగాలు సాక్షిగా కమ్యూనిస్టు పార్టీ జెండాను భూజాన వేసుకుని ముందుకు సాగుతామని, భవిష్యత్‌లో కూడా సిపిఐ అలుపెరగని పోరాటాలకు సిద్ధం కానున్నదని అన్నారు. అందులో భాగంగా సిపిఐ వందేళ్ళ వసంతాలను ఎంతో ఘనంగా నిర్వహించటం జరుగుతుందని, 26న జరిగే సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జిల్లా నేతలు తదితరులు పాల్గొంటారని, మండల వ్యాప్తంగా సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ప్రారంభ సభను విజయవతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు నల్లమోతు నర్సింహారావు, తమ్మారపు వెంకటేశ్వర్లు, నాగమణి, స్వర్ణ, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# 20న జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని యువతి, యువకులకు ప్రైవేట్ రంగమైన హెటిరో నెక్సిటీ, ముత్తూట్ మైక్రో ఫిన్ లిమిటెడ్‌లో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 20న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న శుక్రవారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ, టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. హైదరాబాద్‌లోని హెటిరో నెక్సిటీలో ప్రొడక్షన్, సపోర్ట్ (20 ఖాళీలు), ఇంజనీరింగ్, మెయింటినెన్స్ (50 ఖాళీలు), ప్రొడక్షన్ (110 ఖాళీలు) ఉద్యోగాలకు, అదేవిధంగా ముత్తూట్ మైక్రో ఫిన్ లిమిటెడ్ ఖమ్మంలో రిలేషన్ షిప్ ఆఫీసర్ (30 ఖాళీలు), బ్రాంచ్ క్రెడిట్ మేనేజర్ (5 ఖాళీలు), బ్రాంచ్ రిలేషన్ షిప్ ఆఫీసర్ (5 ఖాళీలు) ఉద్యోగాలు భర్తీ చేయుటకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎంపిక కాబడిన వారికి రూ. 10వేల నుండి రూ. 35వేల వరకు వేతనం ఉంటుందని 18 నుండి 30 సంవత్సరాల వయస్సు గల ఇంటర్, ఐటిఐ, ఫిట్టర్, ఎలక్ట్రికల్, మెకానికల్, కెమికల్ డిప్లొమా, ఎంబిఏ, ఏదైనా డిగ్రీ అర్హత గల జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులు విద్యార్హత గల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8121040350, 9966077622 నెంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారిని తెలిపారు.

# 20 నుంచి ఉచిత యోగా ధ్యానోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యూనైటెడ్ నేషన్స్ డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ప్రకటించినందున శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 22 వరకు రఘునాథపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు, బి. వీరబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 21 నుంచి 22 వరకు సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు నిర్వహించే యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమంలో 15 సంవత్సరాలు దాటిన వారందరూ పాల్గొనవచ్చునని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు 9989606020, 9666022617, 8897785484 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

# క్లినికల్ అప్రెంటిషిప్ శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటర్మీడియట్ ఎంపిహెచ్‌డబ్ల్యూ (ఫిమేల్) ఒకేషనల్ కోర్సులలో ఉత్తీర్ణులైన విద్యార్థినిలకు ఒక సంవత్సరం క్లినికల్ షిప్ శిక్షణ కొరకు ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి, మధిర, తిరుమలాయపాలెం ఏరియా ఆసుపత్రుల్లో శిక్షణ అందించనున్నట్లు ఎంపికైన వారు రూ.1,000 డిడి రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినిలు తమ బయోడేటా ఫారంతో రూ.10 పోస్టల్ స్టాంప్ అతికించిన సొంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈనెల 23లోగా అందజేయాలని ఆయన ప్రకటనలో కోరారు.

# వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తశాతం నిర్ధారణ పరీక్షలు



**ప్రజాపక్షం/వైరా:** గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు లయన్ తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో న్యూలిటిల్ ఫ్లవర్ కాలేజ్ నందు విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి వారి యొక్క బ్లడ్ పర్సంటేజిని తెలియపరచడం జరిగింది. బ్లడ్ పర్సంటేజ్ తక్కువ ఉన్నవారికి ఐరన్ ట్యాబ్లెట్లు, ఐరన్ సిరప్ ఓఆర్ఎస్‌ను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, స్కూల్ కరస్పాండెంట్ పోతినేని భూమేష్ మాట్లాడుతూ గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో రక్త పరీక్ష నమోదు క్యాంపు నిర్వహించడం మంచి కార్యక్రమం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ కోఆర్డినేటర్ పుల్లు శ్యామ్‌బాబు, డిజిఎస్ లగడపాటి ప్రభాకర్‌రావు, జెడిసి పుల్లు వరలక్ష్మి, గంగవరపు కిషన్, పుయ్యూరు రామకృష్ణ, జాలా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సర్వశిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** సర్వశిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎస్టీయు ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి , జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ కరమాత్‌ఆలి, లేడిదోయిన గోపాల్‌రావు, రఘునాథపాలెం ఎస్టీయు నాయకులు ఎన్‌డి మఖ్బూల్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగులు తమ హక్కులకోసం బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంవద్ద పోరాటం చేస్తున్న సందర్భంగా జిల్లా ఉపాధ్యాయసంఘం ఆధ్వర్యంలో వారికి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు సర్వశిక్ష ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం స్పందించి వారి న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని అన్నారు. వారికి టైం స్కేల్ ఇవ్వాలని ప్రతి ఉద్యోగికి ఉద్యోగభీమా సౌకర్యం కల్పించాలని, 12 నెలల జీతం ఇవ్వాలని అన్నారు. ఉపాధ్యాసంఘం ఆధ్వర్యంలో ఈ విషయంపై ప్రభుత్వానికి తెలియజేస్తామని అన్నారు. తొమ్మిదిరోజులుగా చేస్తున్న రిలేనిరాహార దీక్ష నిరాశకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆలోచించి సర్వశిక్ష ఉద్యోగులకు న్యాయంచేకూర్చాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/ సత్తుపల్లి :** పట్టణంలోని జేవి ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆద్వర్యంలో బుధవారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.మట్టా దయానంద్‌విజయ్‌కుమార్ హాజరై, వాక్యా వేక్త విజయ్ ప్రసాద్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేసి క్రిస్టియన్ సోదర,సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడు గాదే చెన్నారావు, కౌన్సిలర్ నాగల, పద్మజ్యోతి, కమల్‌పాషా, మట్టా చెన్నారావు, పింగళి సామ్యేల్, అలవాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు సంబంధించి లబ్ధిదారుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో మున్సిపల్ కమిషనర్ పలు డివిజన్లలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. సర్వే చేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్బంగా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరేలా ఇందిరమ్మ ఇండ్ల యాప్‌ను రూపొందించిందని ఆయన తెలిపారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ది దారుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్వేకు సంబంధించి లబ్దిదారుల వద్ద పూర్తి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని అధికారులకు తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** ప్రభుత్వం సూచించిన విధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని డా॥ బిఆర్ అంబేడ్కర్ కళాశాలను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట తో కలిసి సందర్శించారు. అక్కడి విద్యార్థినిలతో వారు ముచ్చటించారు. ఎక్కడ నుంచి వచ్చారు, ఏమి చదువుకుంటున్నారు, భోజనం ఎలా ఉంటుంది, మెనూ ప్రకారం పెడుతున్నారా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించడంతో పాటు రుచికరమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటుందని వారు తెలిపారు. ప్రభుత్వం సూచించినవిధంగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థినిలు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరేలా కష్టపడాలని తెలిపారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి




**ప్రజాపక్షం/మణుగూరు:** ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని బుధవారం మణుగూరు పట్టణంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో డిటిఎస్ కృష్ణ, ఆర్ఐ లీలావతి, ఆర్ఐ గోపి, గంట వెంకటేశ్వర్లు, రామారావు, ఏపీఎం అహ్మద్ హుళ్ళ, వెంకటి, మున్సిపాలిటీ కమిషనర్ యాదగిరి, సత్యనారాయణ, సరిత, కోటేశ్వరరావు, రత్నాకర్, మధు, నరేందర్, రవీందర్, సందీప్, మెప్మా సిబ్బంది, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పాలిటెక్నిక్ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు నూతన ఎస్ఐగా హరిత..?



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు రక్షకబద్ద నిలయ ఎస్సైగా డి హరిత గురువారం బాధ్యతలు చేపట్టనున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో ఉన్న తోట నాగరాజు బదిలీపై వెళ్లడంతో ఖాళీగా ఉన్న కల్లూరు ఎస్సై స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం తెలియ వచ్చింది. గతంలో వెంట వెంటనే షేక్ షాకీర్ తర్వాత తోట నాగరాజు ఇరువురు ఎస్ఐలు బదిలీపై వెళ్లడంతో కల్లూరులో ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

## 26న సిపిఐ ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదం చేయండి

**-పాత ధర్నాచౌక్ నుండి భారీ ర్యాలీ**
**-భక్తరామదాసు కళాక్షేత్రంలో సభ**
**-సిపిఐ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి**




**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న ఖమ్మంలో ఆవిర్భావ సభను నిర్వహిస్తున్నామని సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ విజ్ఞప్తి చేశారు. సిపిఐ ప్రజాసంఘాల సంయుక్త సమావేశం యర్రాబాబు అధ్యక్షతన బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ డిసెంబర్ 26కు పార్టీ ఆవిర్భావించి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగిడనుందని ఈ సందర్బంగా రెడ్‌షర్ట్ వాలంటీర్లు 100 మంది అరుణ పతాకాన్ని చేబూని ముందు వరుసలో ఉంటారని ఆ తర్వాత కోలాట, డప్పు దళాలు ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలతో ప్రదర్శన సాగుతుందని సురేష్ తెలిపారు. భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ప్రదర్శన సాగుతుందని ప్రదర్శన అనంతరం సభ జరుగుతుందన్నారు. ఈ సభకు సిపిఐ జాతీయ నాయకులు హాజరుకానున్నారని సురేష్ తెలిపారు. 100 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీకి ఒక ప్రత్యేకత ఉందని ఇక్కడ భూ పోరాటాలు , సాయుధ తెలంగాణ పోరాటం తదనంతరం జరిగిన అనేక పోరాటాలకు సిపిఐ నేతృత్వం వహించిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ సుదీర్ఘ ఉద్యమ చరిత్రలో ప్రతి పల్లె పాలు పంచుకుందని కమ్యూనిస్టు పార్టీ చరితలో ప్రతి పల్లెకు ఓ స్థానం ఉందని సురేష్ తెలిపారు. ఆవిర్భావ దినోత్సవాలు ఏడాది పొడవునా నిర్వహించి ప్రతి ఘట్టాన్ని నేటి తరానికి తెలియజేయడంతో పాటు కార్యకర్తలను భవిష్యత్తు పోరాటాలకు కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయాలన్నారు. ప్రజా సంఘాలు ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సురేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి బాగం హేమంతరావు, ప్రజా సంఘాల నాయకులు కొండపర్తి గోవిందరావు, మహ్మద్ సలాం, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, పగడాల మల్లేష్, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం

**-హాస్టళ్లను ప్రక్షాళన చేయాలి**
**-ఎలుక కాటు ఘటనపై విచారణ జరిపించాలి**
**-బాలికను పరామర్శించిన సిపిఐ, ఏఐఎస్ఎఫ్ నేతలు**





**ప్రజాపక్షం/ఖమ్మం :** సంక్షేమ హాస్టళ్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని క్షేత్ర స్థాయిలో హాస్టళ్ల పరిస్థితిని తెలుసుకుని తదనుగుణంగా చర్యలు చేపట్టాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయి అధికారుల తప్పిదాలు విద్యార్థుల పాలిట శాపంగా మారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎలుక కాటుకు గురై మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మి భవాని కీర్తిని ఆయన పరామర్శించారు. ఈ సందర్బంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పదే పదే ఎలుకలు కాటేస్తుంటే చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని దానవాయిగూడెం గురుకుల పాఠశాల సిబ్బంది ఎలుకలు కరిస్తే ఉండలేకపోతే ఇంటికి వెళ్లవచ్చునని బెదిరింపు ధోరణిలో మాట్లాడడం శోచనీయమన్నారు. ఎలుక కరిచినందు వల్ల యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ ఇచ్చారని అది ఇప్పుడు బాలిక అనారోగ్యానికి కారణమైందన్నారు. మోతాదుకు మించి వ్యాక్సిన్ ఇవ్వడం కారణంగానే లక్ష్మి భవాని కీర్తి కాళ్లు చచ్చుపడ్డాయని హేమంతరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆయన కోరారు. ఎస్ఎన్ మూర్తి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేవని విద్యార్థులకు బెడ్స్ లేకపోవడంతో కింద పడుకోవడం వల్ల తరచూ ఇబ్బందులకు గురవుతున్నారని హేమంతరావు తెలిపారు. బెదిరింపు ధోరణికి పాల్పడుతున్న స్థానిక సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. మమత వైద్యులను బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తాటి వెంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గురుకుల విద్యార్థిని హర్షశ్రీ మృతి

**తండ్రి అయ్యప్ప ఇరుముడి కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం**






**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని తెలంగాణ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చెరుకూరి హర్షశ్రీ రోడ్డు ప్రమాదంలో బుధవారం మరణించింది. వివరాల్లోకి వెళితే రఘునాధపాలెం మండలం కోయచిలక గ్రామానికి చెందిన చెరుకూరి వీరబాబు, నాగమణి దంపతులకు ఇద్దరు కూతుళ్ళు, పెద్ద కుమార్తె చెరుకూరు హర్షిని(13) వైరాలో తెలంగాణ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతుంది. తండ్రి చెరుకూరి వీరబాబు అయ్యప్ప స్వామి మాల ధరించడంతో ఈ నెల15వ తారీఖున వారి ఇంటి వద్ద ఉన్న పడి పూజ కార్యక్రమానికి కూతురు తీసుకొని వెళ్లారు. బుధవారం తండ్రి ఇరుముడి కార్యక్రమం కావడంతో తండ్రి శబరిమలై బయల్దేరి వెళ్లగా కూతురు శ్రీహర్షశ్రీని మేనమామ శ్రీకాంత్ వైరా గురుకుల పాఠశాలకు పంపించడానికి తీసుకొని వస్తున్న క్రమంలో వైరాలో లారీ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న హర్షశ్రీ ఒక పక్క శ్రీకాంత్, మరో పక్క పడిపోవడం జరిగింది. హర్షశ్రీ లారీ టైర్ క్రింద పడిపోవడంతో అక్కడికక్కడే మరణించింది. అప్పటివరకు కుటుంబ సభ్యులతో ఇరుముడి కార్యక్రమంలో ఎంతో ఆనందంగా గడిపిన విద్యార్థిని హర్షశ్రీ మరణించిన విషయం కుటుంబ సభ్యులను , బంధువులను, గ్రామస్థులను కంటతడి పెట్టించి దిగ్భ్రాంతికి గురిచేసింది. విషయం తెలుసుకున్న వైరా పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అంతా అస్తవ్యస్తం..!

**-పార్కింగ్‌లు లేని వ్యాపార సముదాయాలు**
**-రహదారికి ఇరువైపుల అడ్డగోలు పార్కింగ్‌లు**
**-రాకపోకలకు అంతరాయం**
**-ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదాచారులు**











**ప్రజాపక్షం / ఖమ్మం, క్రైం :** నగరంలో ట్రాఫిక్ కష్టాలు వర్ణణాతీతం. విద్యా, వైద్య, వ్యాపార వివిధ పనుల నిమిత్తం చుట్టు పక్కల మండలాలు, గ్రామాల నుంచి ప్రజలు నిత్యం ఖమ్మం నగరానికి వేల సంఖ్యలో తరలిరావడంతో ప్రధాన రహదారు వాహనాల రాకపోకలతో రద్దీగా మారాయి. వైరారోడ్డు, ఇల్లెందు రోడ్డు, రైల్వేస్టేషన్, పాతబస్టాండ్ రోడ్డు, కమాన్‌బజార్, కస్బాబజార్, గాంధీచౌక్, బైపాస్‌రోడ్డు, కొత్త బస్టాండ్ ప్రాంతాలు ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లతో పద్మవ్యూహన్ని తలపిస్తున్నాయి. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో పాదచారులు రోడ్డు దాటలంటే నానాయతన పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో రోడ్డుప్రమాదాల బారీన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. అత్యవసర సేవలందించే అంబులెన్స్‌లకు సైతం ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు. ప్రధాన కూడళ్లు, సిగ్నాల్స్ వద్ద చాలా సమయం వేచిఉండవలసి రావడంతో అందులో ఉన్న రోగులకు సమయానికి వైద్య సేవలు అందక మృత్యువాత పడిన సందర్భాలు సైతం ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం నగరంలో చాలా వరకూ ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్, వ్యాపార సముదాయాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడమే అని చెప్పవచ్చు. సెల్‌లార్‌లను నామమాత్రం పార్కింగ్‌లుగా చూపించి అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టిన సదరు నిర్వాహకులు తమ వద్దకు వచ్చే వారికి వాహనాలు నిలిపేందుకు సరైన పార్కింగ్ స్థలాలు కేటాయించకపోవడంతో ఈదుస్థితి నెలకొందని నగరవాసులు వాపోతున్నారు. ప్రధానంగా ఇల్లెందు క్రాస్‌రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఇక్కడి నుంచి నేరుగా పాతబస్టాండ్, నగరంలోకి కొన్ని వాహనాలు దారిమళ్లి వలసి ఉండగా మరికొన్ని ఎన్టీఆర్ సర్కిల్ , బైపాస్ మీదుగా కొత్తబస్టాండ్‌కు వెళ్తుంటాయి. ఈ ప్రాంతంలో ఉన్న వ్యాపార సముదాయాలకు ఎటువంటి పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు ఎక్కడ పడితే అక్కడ తమ వాహనాలను నిలిపివేస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అంతేకాకుండా భద్రాచలం, సత్తుపల్లి తదితర పట్టణాల నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇక్కడి నుంచి కొత్త బస్టాండ్‌కు వెళ్తుంటాయి. దీంతో రైల్వేస్టేషన్, ఖమ్మం నగరంలోకి వెళ్లే ప్రయాణికులు చాలా వరకూ ఇక్కడే దిగి ఆటోలను ఆశ్రయిస్తుంటారు. ఇరుకైన రోడ్డు, ట్రాఫిక్ సిగ్నాల్ పాయింట్, చిరువ్యాపారులు ఎక్కువగా ఉండే ప్రాంతం కావడంతో అక్కడికి వచ్చే వారు తమ వాహనాలను రోడ్డు పక్కగా నిలిపివేళ్తుంటారు. వాటికి తోడు ఆటోవాలాలు నగరంలోకి వెళ్లేవారి కోసం తమ ఆటోలను నిలిపిఉంచడంతో అటుగా వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడంలేదు. ఇదిలా ఉండగా మరోపక్క ఇల్లెందు క్రాస్‌రోడ్డు నుంచి ఎన్ఎస్‌పి రోడ్డు మూలమలుపు జిపి రెడ్డి స్వీట్ షాప్ వరకు వరుసగా నాలుగు వైన్ షాపులు ఉండటంతో మందు బాబులు తమవాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేసి వెళ్తుండటంతో అటుగా వెళ్లే పాదాచారులు, ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు అవతలవైపు స్టేడియం ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళాల్లో వాకింగ్ వచ్చే వారికి ఇది తలనొప్పిగా మారింది. అంతేకాకుండా సమీపంలో ప్రభుత్వ డిగ్రికళాల, పిజి కళాశాలలు, విద్యార్థి, విద్యార్థినుల వసతిగృహాలు సైతం అక్కడే ఉండటంతో వారు నడిచి రోడ్డు దాటలేని దుస్థితి నెలకొంది. ఈ మార్గంలో నిత్యం విఐపి లరాకపోకలు సాగుతుంటాయి. జిల్లాకు చెందిన ముగ్గురు రాష్ట్ర మంత్రులు ఖమ్మంలోకి రావాలన్నా పోవాలన్నా ఈమార్గం గుండా వెళ్లల్సిన పరిస్థితి. వారు వచ్చే సమయంలో మాత్రమే హడావిడి చేసే పోలీసులు అనంతరం పట్టనట్టు వ్యవహరిస్తున్నారంటూ ఆప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు పోలీసులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి సమస్యపరిష్కరించాలని కోరుతున్నారు.

ఈ విషయమై ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబును వివరణ కోరగా వైరారోడ్డులోని ఆస్పత్రులు, వ్యాపార సంస్థలకు పార్కింగ్ స్థలాలు చాలావరకూ లేవన్నారు. ఉన్న సెల్‌లార్‌లలో ల్యాబ్‌లు, మెడికల్ షాపులకే పరిమితం అయినాయన్నారు. వారికి నోటీసులు సైతం ఇచ్చామన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద తమ సిబ్బంది షిఫ్టల వారిగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. నిత్యం సాయంత్రం వేళాల్లో వాహనతనిఖీలు, పెట్రోలింగ్ చేపడుతూ రాంగ్ పార్కింగ్ వాహనాలకు ఫైన్‌లు వేస్తున్నామన్నారు. నగరంలో స్థలాల కొరత ఉందని ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాల వద్ద వాహనాలు నిలిపేందుకు స్థలాల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సర్వేచేస్తున్నామన్నారు. గతంలో కంటే ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎస్సై



**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న స్వీపర్ పగిడిపల్లి శంకర్ ది రెక్కాడితేగాని డొక్కాడలేని పరిస్థితి. తల్లి అనారోగ్యంతో భాధపడుతూ ఉంటే హాస్పిటల్‌లో ఉంచి చికిత్స చేయించుకుంటూ కూలీనాలీ చేస్తున్న శంకర్ ఆర్థిక పరిస్థితి చూసి చెలించి పోయిన చింతకాని ఎస్సై నాగుల్‌మీరా తన ఓదార్యం చాటుకున్నారు. కాకీల్లో కూడా మానవత్వం ఉంటుందని నిరూపించారు. సామాజిక స్పృహ కలిగిన చింతకాని ఎస్సై నాగుల్‌మీరా తమ సిబ్బందితో మాట్లాడి స్వీపర్ శంకర్‌కు ఆర్థిక సహాయం చేశారు. స్టేషన్‌లోని పోలీసులు అందరూ కలిసి బుధవారం శంకర్‌కు రూ.17వేలు ఆర్థిక సహాయం చేశారు. తన పరిస్దితి చూసి తనకు సహాయం అందించిన ఎస్సై నాగుల్‌మరా కు,సిబ్బంది కి శంకర్ కృతజ్ఞతలు తెలిపాడు.

## విద్యా నిలయంలో రైస్, స్వీట్స్ పంపిణీ




**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి మణుగూరు ఏరియా విశ్రాంత అదనపు జనరల్ మేనేజర్ (ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్) నర్సిరెడ్డి తన కుమారుని పెండ్లి రోజు మరియు మనవడి పుట్టిన రోజు సందర్భాన్ని పురస్కరించు కొని బుధవారం సీ టైపు దగ్గర గల చెవిటి, మూగ అంగవైకల్యం గల విద్యా నిలయంలో రైస్ మరియు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠ శాల కరస్పాండెంట్ మరియు సిబ్బంది డఫ్ అండ్ డం విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని నర్సిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఈ పాఠశాల క్రమశిక్షణతో మాటలు రాని మూగ పిల్లలకు, అంగవైకల్యం గల అంధులకు వివిధ రకాలుగా విద్యా బోధనలు అందిస్తూ వారి మానసిక ఉల్లాసానికి ఎంతో శ్రమ పడడం సంతోషాన్ని కలగజేస్తుందని ఇక్కడి పాఠశాల కరస్పాండెంట్ సిబ్బంది మరియు ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఎంతో శ్రమ పడుతూ విద్యాబుద్ధులు నేర్పడం అభినందనీయమని అన్నారు. గత 30 సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యులు పాఠశాలను చూడడం పలుమాలు సందర్శించటం జరిగిందని ప్రత్యేక అవసరాలు ఉన్న ఈ పిల్లలకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావలసిన అవశ్యము ఎంతైనా ఉందని తెలిపారు.

## ఘనంగా అయ్యప్ప ఇరుముడి కార్యక్రమం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం అయ్యప్పల ఇరుముడి కార్యక్రమం మల్లేష్ గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. 41రోజు కఠిన దీక్ష చేసి అయ్యప్పలు మంగళవారం రాత్రి అయ్యప్ప పడిపూజ కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించారు. రామాలయ ఆలయ ప్రాంగణమంతా స్వామియే శరణమయ్యప్ప అనే నామముతో మారు మోగింది. భజన బృందం భక్తి గీతాలతో మహాపడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి భక్తులు స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఉదయం 7గంటల నుండి అయ్యప్పల ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పలు తరలి వెళ్లారు. ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు అయ్యప్పలకు పూలతో స్వాగతం పలుకుతూ జలంతో అయ్యప్పల పాదాలు కడుగుతూ ఊరేగింపు కార్యక్రమాన్ని ఉత్తేజంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో గురుస్వాములు పానుగంటి వెంకటేశ్వర్లు స్వామి, బాలరాజు స్వామి, సదానంద చారిస్వామి, యుగంధర్ స్వామి, వెంకన్న స్వామి, స్వాములు సాయి, సాంబయ్య, నవీన్, వినోద్, రంజిత్, ప్రశాంత్, సంపత్, హరీష్, సురేష్, శ్రీను, సాయి, కాంత్, కన్య స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## హక్కులసాధనకు పోరాటలే శరణ్యం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి టిపిటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. తదానంతరం జరిగిన మండల కమిటీ సమావేశం టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు బానోత్ భోజ్య అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో టిపిటిఎఫ్ ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యులు యం రామాచారి, టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబులు పాల్గొని మాట్లాడుతూ వెట్టి చాకిరిని వ్యతిరేకిద్దాం సమగ్ర శిక్ష ఉద్యోగుల, ఉపాధ్యాయుల న్యాయమైన పోరాటాన్ని సమర్థిద్దాం అని, కెజిబివి, యుఆర్ఎస్ సమగ్ర ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై డిసెంబర్ 10 నుండి చేస్తున్న ఉద్యమానికి మద్దతు ఇద్దాం, సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వారి వెంట నిలుద్దామని, విద్యారంగంలో క్రియా శీలక పాత్ర పోషిస్తున్న కెజిబివి, యుఆర్ఎస్ సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష, కెజిబివిలలో పని చేస్తున్న ఉద్యోగుల, ఉపాధ్యాయినీల, సిబ్బంది రెన్యువల్ పద్ధతిని తొలగించాలని, గురుకుల ఉపాధ్యాయునులతో సమానంగా 27రోజులు సాధారణ సెలవులు, పిల్లల సంరక్షణా సెలవులు, హిస్టరెక్ట మీ సెలవులు కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో బిక్షమయ్య, లాలయ్య, కె రామయ్య, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, శ్రీనివాస్, కుమార్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/గుండాల :** ఈ నెల 22,23న ములుగు జిల్లా ఏటూర్‌నాగారంలో జరిగే తుడుం దెబ్బ తొమ్మిదోవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శెట్టిపల్లి గ్రామంలో పోస్టర్‌ను తుడుందెబ్బ జిల్లానాయకులు కల్తి మల్లయ్య ఆద్వర్యంలో ఆవిష్కరింప చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల అస్తిత్వంకోసం నాటిఆదిమ కాలంనుండి నేటి ఆదునిక కాలంవరకు అనేక ఉద్యమాలను నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా పోడుభూముల విషయంలో నూ గిరిజనచట్టాలను కాపాడుకోగలిగే స్థితిలో ఆదివాసి పోరాటాలు నిలుస్తున్నాయన్నారు. ఆదివాసి మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమాలు పటిష్టంగా నడిచేవిదంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని పిలుపునిచ్చారు. జల్ జంగిల్ జమీన్ కోసం భీం వారసత్వాన్ని పునికి పుచ్చుకొని ప్రతి గిరిజన గూడేల ప్రజలు సన్నద్ధమై జరిగే రాష్ట్రమహాసభలను విజయ వంతం చేసేందుకు కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇర్ప రాజేంద్ర ప్రసాద్, బుచ్చయ్య, క్రిష్ణ, సురేష్, సూర్యం, శేఖర్, సుదాకర్, శరత్, సందీప్, సాగర్, కత్తుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతున్న గురుకులం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని గురుకుల కళాశాల సమీపంలో దుర్గంధం దుర్వాసన, కంపు కొడుతుండటంతో వాహనదారులు, ఎన్ఎస్పి లోని కళాశాలకు మరియు కార్యాలయాలకు రాకపోకలు చేస్తున్న ప్రజలు కంపు కొడుతున్న వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలో 600 మందిపైగా విద్యార్థినిలు ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారు. కళాశాలలో ఉన్న మరుగుదొడ్ల వాసనలు రావడంతో జాతీయ రహదారిపై రాకపోకలు చేస్తున్న ప్రయాణికులు, వాహనదారులు ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లాల్సి రావాల్సి వస్తుంది. గత వారం రోజులుగా ఇదే విధంగా కొనసాగుతోంది. సంబంధిత గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ను సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు, వాహనదారులు, సమీప గృహస్తులు కోరుతున్నారు.

# పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు

**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధ వారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరా మహిళా డెయిరీ, హాస్టళ్లలో చేయాల్సిన ఏర్పాట్లుపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా డెయిరీ స్థాపన, పాడి పశువుల యూనిట్లకు 250 మంది లబ్దిదారుల ఎంపిక, వివిధ అంశా లలో అధికారులు బాగా పనిచేశారని కలెక్టర్ అభినందించారు. పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు అధికారులు పకడ్బందీ చర్యలు తీసు కోవాలన్నారు. మండల కేంద్రాలలో బిఎంయు ల ఏర్పాటుకు సంబం ధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామని నిధులు మంజూరు కాగానే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యే లోపు సంబంధిత స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఇందిరా మహిళా డెయిరీకి ఒక గవర్నింగ్ బాడీ ఏర్పాటుకు రూల్స్ తయారు చేయాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో చలికాలం నేప థ్యంలో పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, దోమ తెరలు, అవసరమైన దుప్పట్లు, బ్యాంకెట్లను అందుబాటులో ఉంచాలని, స్నానానికి వేడి నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన సురక్షిత త్రాగునీటి సరఫరా కోసం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలన్నారు. పిల్లలకు అందించే ఆహారం విషయంలో చిన్న పొరపాటు జరిగిన తీవ్రంగా పరి గణించడం జరుగుతుందని ఎటువంటి తప్పులు జరగవద్దని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌డివో సన్యాసయ్య, డిఎస్‌సి డివో కస్తాల సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాల కులు ఎన్. విజయలక్ష్మి, ఎస్‌ఈ కార్పొరేషన్ ఇంచార్జి ఈడి నవీన్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, అడిషనల్ డిఆర్‌డివో నూరుద్దీన్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపార విస్తరణ లాభార్జనపై అవగాహన కల్పించాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** వ్యాపార విస్తరణ, లాభార్జనపై మహిళ లకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలి పారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా మార్ట్, ఇందిరా మహిళా శక్తి అమలుపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలె క్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలతో సమన్వయం చేసు కుంటూ స్వశక్తి మహిళా సంఘాలు తయారు చేసే సామాగ్రిలను అమ్మేందుకు మహిళా మార్ట్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయా లని తయారు చేసే వస్తువులకు ప్యాకింగ్, బ్రాండింగ్ కల్పించేందుకు దృష్టిసారించాలన్నారు. ఇందిరా మహిళా శక్తి క్రింద మండలాల్లో వ్యాపారాలు నిర్వహించే మహిళా సంఘాలకు వ్యాపార విస్తరణ, లాభా ర్జనపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సంక్రాం తికి ముందే కలెక్టరేట్‌లో నూతన యూనిట్లు ఏర్పాటు చేసిన 300 మంది మహిళలకు అకౌంటింగ్, వ్యాపార నైపుణ్యాలపై రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, ఇంచార్జి ఎస్‌ఈ కార్పొరేషన్ ఈడి నవీన్‌బాబు, అడిషనల్ డిఆర్‌డివో నూరుద్దీన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ఆంగ్ల పరిజ్ఞానం పెరిగేలా చర్యలు...**

విద్యార్థులకు ఆంగ్ల పరిజ్ఞానం దశల వారీగా పెరిగేలా చర్యలు తీసుకో వాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం తెలంగాణ ఎడ్యుకేషనల్ లీడర్ షిప్ కలెక్టివ్ ప్రతినిధులు ఖమ్మంజిల్లాలో వి కెన్ లెర్న్ కార్యక్రమం అమలవుతున్న మామిళ్ల గూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పల్లిపాడు ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థుల పురోగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వి కెన్ లెర్న్ అమలుపై కలెక్టర్ ముజ మ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి సంబంధిత అధికా రులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఆరు, ఏడవ తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను పూర్తి స్థాయిలో ఉపయో గించుకునేలా చూడాలన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్‌లో విద్యార్థుల పురోగ తిని పరిశీలిస్తుండాలని, ఆంగ్లంలో మాట్లాడుకునేలా ప్రోత్సహించాల న్నారు. విద్యార్థులు తప్పులు మాట్లాడిన వెంటనే సరిదిద్దాల్సిన అవ సరం లేదని ముందు వారిలో భయం, మొహమాటం లేకుండా ఆంగ్లంలో మాట్లాడటం ముఖ్యమన్నారు. విద్యార్థుల్లో నమ్మకం కలిగితే ఆంగ్ల భాష నేర్చుకోవడం ఎక్కువ సమయం పట్టదని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, అకాడమిక్ మానిటరింగ్ అధికారి కె. రవికుమార్, ప్రతినిధుల బృందం పవిత్ర, అస్త్ర, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో క్రిస్మస్ తాత సందడి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధి లోని పెద్ద కోరుకొండి, చెన్నూరు, ఎర్రబోయిన పల్లి, చిన్న కోరుకొండి, తాళ్లూరు వెంకటాపురం, కల్లూరు, పేరువంచ ,కప్పల బంధం తదితర గ్రామాలలో పురవీధులలో రాబోయే క్రిస్మస్ పండుగ సందర్భంగా గ్రామాలలో క్రిస్మస్ తాత వేషధారణలో, బాల యేసు స్వరూపంతో క్రైస్త వుల గృహాలకు వెళ్లి క్రీస్తు ప్రభువు జన్మించబోతున్నాడు... అంటూ పాపుల రక్షణకు, ప్రజల రక్ష ణకు భూలోకంలో కి రాబోతున్నాడు.. సిద్ధంగా ఉండాలని ఇంటింటికి వెళ్లి మిఠాయిలు పంచుతూ క్రైస్తవులు, క్రీస్తు ప్రభువు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, బైబిల్ వాక్యాలతో ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. క్రైస్తవుల గృహాలపై ముందుగా నక్షత్రం కట్టి వాటిపై విద్యుత్ వెలుగులతో అలంకరణలతో సిద్ధంగా ఉంచారు. ఈ కార్యక్రమంలో మత గురువులు జోజి బాబు, సురేష్‌లతోపాటు కన్య స్త్రీలు, ఉపదేశకులు, సంఘ పెద్దలు, యువతీ యువకులు పాల్గొంటున్నారు.

# ఆటో దొంగ అరెస్టు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** వైరా రోడ్డులోని ఆసుపత్రి ఎదుట నిలిపి ఉంచిన ఆటోను దొంగిం చిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ మౌలానా తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా మర్రిపేడ బంగ్లా కు చెందిన అజ్మీర రాందాస్ తన ఆటోను బంధువును చికిత్స నిమిత్తం ఖమ్మంలోని పూజ ఆసుపత్రికి రెండు రోజుల క్రితం తీసుకువచ్చాడు. ఈ క్రమంలో ఆటోను ఆసుపత్రి ఎదుట నిలిపి లోనికి వెళ్లి తిరిగి కొంత సమయం తర్వాత బయటకు వచ్చి చూడగా ఆటో కనిపించ లేదు. పరిసరాల్లో చూడగా ఫలితం లేకపోవడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ మౌలానా బుధవారం బస్టాండ్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా సంచరి స్తున్న ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ల గ్రామానికి చెందిన గోనెల వెంకన్నను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు తెలిపాడు. అతని నుంచి ఆటోను స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

# చెట్టు తొలగించినందుకు ఐదువేల జరిమానా



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** దుకాణం ముందు ఉన్న చెట్టును తొలగించినందుకు దుకాణదారు నికి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఐదువేల రూపాయల జరిమానా విధించారు. బుధవారం ఖమ్మం నగరంలోని 12వ డివిజన్ పర్ణశాల ఎదురుగా ఉన్న శ్రీభవాని ప్లైవుడ్, హార్డ్ వేర్ దుకాణం ముందు ఉన్న పుగాడ చెట్టును దుకాణానికి అడ్డంగా ఉందని తొలగించారు. సమాచారం అందుకున్న శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య శానిటరి ఇన్‌స్పెక్టర్ రమేష్, డివిజన్ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి దుకా ణదారునికి ఐదువేల జరిమానా విధించారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలం నాగులవంచ,బొప్పారం సమపంలోని వ్యవ సాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఈనెల 4న గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి దానిలోని కాపర్ తీగెతో పాటు ఇతర సామాగ్రిని అపహరించారు.నాగులవంచ సబ్‌స్టేషన్ ఏఈ ఉమా మహేశ్వరి ఇచ్చినఫిర్యాదుమేరకు ఎస్సై నాగులమీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీచైతన్యలో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు






**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులు జరగనున్న ఈ ఉత్సవాల్లో మొదటి రోజు బుధ వారం శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్లు మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్యలు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఎదురయ్యే ఒత్తిడిని తొలగించి మానసిక ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. చేసే ప్రతి పనిని ఆత్మవిశ్వాసంతో చేస్తే లక్ష్యాలను సాధించవ చ్చునని ఇందుకు తమ విద్యాసంస్థలే నిదర్శనమన్నారు. పట్టుదల, నమ్మకం, క్రమశిక్షణ సాధ నతో ఎంతటి కష్టతర పరిస్థితులైన ఎదుర్కొని విజయాలను సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరామ్ జలదుర్గం మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి తమ లక్ష్యాలను సులభంగా సాధించే మార్గాలను విద్యార్థులకు వివరించారు. ఒత్తిడి భరించలేక ఆత్మహత్య భావన చేయడం పిరికి చర్య అన్నారు. బాధ్యత నుండి పారిపో వడం కాకుండా వాటిని ఎదుర్కొని సమస్యలకు కారణాలు సమీక్షించి అధిగమించాలని విద్యా ర్థుల్లో మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్ర మాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీరామ్ జలదు ర్గంకు విద్యా సంస్థల యాజమాన్యం, సిబ్బంది శాలువతో సత్కరించి మెమోంటోను అందజే శారు. ఈ కార్యక్రమంలో డిజిఎం చేతన్ మాధుర్, ఎగ్జిక్యూటివ్ డీన్ ఎస్ఆర్ఎస్‌డి వర్మ, ఎంజి ఎంలు సిహెచ్ బ్రహ్మం, జి. గోపాలకృష్ణ, ప్రకాష్, జోనల్ ప్రిన్సిపాల్ రత్నాకర్‌రావు, ఎస్‌సిబిటి ప్రిన్సిపాల్ మురళికృష్ణ, డీన్ సుదర్శన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి సర్వే 24 కల్లా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** ఇందిరమ్మ ఇంటింటి సర్వే ఈనెల 24 కల్లా పూర్తి చేయాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్ర అధికారులకు ఆదే శించారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు, తల్లాడ, పెను బల్లి మండలాలకు చెందిన తహశీల్దార్, ఎంపీ డీవోలకు ఆదేశాలిస్తూ ప్రతి రోజు 30 మరియు 40 గృహాలను సర్వే చేస్తూ దరఖా స్తుదారుల పూర్తి వివరాలకు ఆయా గృహా లకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేయాలని అధికారులను కోరారు. ఈ సంద ర్భంగా తహశీల్దార్, ఎంపీడీవోలతో ప్రత్య క్షంగా సమాచారాన్ని తీసుకుంటున్నారు. త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ఎప్పటి కప్పుడు సిబ్బందిని తగు సమాచారాన్ని తీసు కొని ఆర్డీఓ కార్యాలయంకు సమాచారాన్ని అందించాలని కోరారు. నేటి వరకు 27% మాత్రమే సర్వే పూర్తయినట్లు పేర్కొన్నారు.

## హైమావతి కుటుంబానికి

# ప్రభుత్వం న్యాయం చేయాలి

**- రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి -సమగ్ర శిక్షా ఉద్యోగుల ర్యాలీ**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న హైమా వతి ఉద్యోగ భద్రతపై ఆందోళనతో మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మరణించిందని ఆమె కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి న్యాయం చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూన్నీ సౌజన్య డిమాండ్ చేశారు. గుండెపోటుతో మృతిచెందిన హైమావతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ బుధవారం సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు పెద్దతండాలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ విద్యాశాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు గత 10 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మానసిక ఒత్తిడికి గురై తిరుమలాయపాలెం ఎంఆర్‌సి నందు సిపివోగా పనిచేస్తున్న కె. హైమావతి గుండె పోటుతో మంగళవారం రాత్రి మృతి చెందిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని అప్పటి వరకు పేస్కేల్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మృతిచెందిన హైమావతి కుటుంబానికి ప్రభుత్వం రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషి యాతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి ఎస్ ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. హైమావతి కుటుంబా నికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీర స్వామి, సిపివో రాష్ట్ర మాజీ అధ్యక్షులు కనకయ్య, విజయలక్ష్మి, అనిల్, ఇస్మాయిల్, మదార్, సైదులు, సాంబశివరావు, సురేష్, సమగ్ర శిక్షా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.